## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455

epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక — సామాన్యుడి నేస్తం




ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 83 శుక్రవారం 24 జూలై 2026, పేజీలు - 4 వెల :2/-

## ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదు: రేవంత్ రెడ్డి

-ఫిర్యాదు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్

-తప్పుడు ఫిర్యాదు అయితే లోపల వేయిస్తానని హెచ్చరిక

-ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ డిమాండ్ చేయడం లేదని విమర్శ




హిందుస్థాన్ మీడియా

తనకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ వస్తున్న ఆరోపణల పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న ఆరోపణలపై దమ్ముంటే ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. ఒకవేళ అది తప్పుడు ఫిర్యాదు అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన ఓటు బదిలీ కోసం నిబంధనల ప్రకారం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓట్లను తొలగించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్‌పై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఓటర్ల జాబితా సవరణ పూర్తయిందని, ప్రక్షాళన నెపంతో ఓట్లు గల్లంతు కాకుండా ఉండేందుకు బీఎల్ఓలను నియమించినట్లు వివరించారు. ఓట్లు లేకపోతే ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు. హైడ్రా పనితీరుపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. ఈ సంస్థ ఇప్పటికే అనేక అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా గాలికొది లేశారని విమర్శించారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి కారణంగానే కేసీఆర్ గతంలో హరీశ్ రావును కొంతకాలం మంత్రి పదవికి దూరంగా ఉంచారని ఆరోపించారు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటర్‌మీడియట్ ఫలితాల వెల్లడిలో జరిగిన తప్పిదాల వల్ల 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో కేటీఆర్ తన నిజాయతీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలకు కారణమైన కేటీఆర్, ఇప్పటికైనా బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ఆయన నిలదీశారు

## జూలై 24న జరగాల్సిన ఓయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా



-విద్యార్థి సంఘాల బంద్.. ఓయూ పరిధిలో రేపటి పరీక్షలు వాయిదా

-విద్యార్థి సంఘాల బంద్ పిలుపుతో వర్సిటీ నిర్ణయం

-నీట్ లీకేజీ, విద్యార్థులపై లాఠీచార్జ్‌కు నిరసనగా బంద్

-త్వరలోనే కొత్త తేదీలను ప్రకటించనున్న అధికారులు

హిందుస్థాన్ మీడియా

ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 24, శుక్రవారం నాడు జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపు నివ్వడంతో వర్సిటీ అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నీట్ యూజీ 2026 పేపర్ లీకేజీ వ్యవహారం, కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ వంటి వామపక్ష, కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బంద్‌కు పిలుపునిచ్చాయి. ఢిల్లీలో 'ఛలో పార్లమెంటు మార్చ్' నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, బంద్ కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో అధికారులు ముందుస్తు జాగ్రత్త చర్యగా పరీక్షలను వాయిదా వేశారు. ఈ నిర్ణయం ఓయూ పరిధిలోని అన్ని అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో జేఎన్‌టీయూ-హైదరాబాద్ వంటి ఇతర విద్యాసంస్థలు కూడా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాయి. పరీక్షల వాయిదాతో విద్యార్థులకు తాత్కాలికంగా ఊరట లభించినప్పటికీ, అకడమిక్ క్యాలెండర్‌పై దీని ప్రభావం పడనుంది. వాయిదా పడిన పరీక్షల తదుపరి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని వర్సిటీ అధికారులు వెల్లడించారు.

## కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనం.. చంద్రబాబుపై భూమన తీవ్ర విమర్శలు

-తిరుపతిలో 16 ఎకరాల భూమిని భూమన కబ్జా చేశారనే ఆరోపణలు భూమిని స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం

-21 ఏళ్ళ క్రితమే ఆ భూమిని కొనుగోలు చేశానన్న భూమన

-గతంలో సీఎంగా ఉన్నప్పుడు ఇవి ఆక్రమణలుగా మీకు కనిపించలేదా అని ప్రశ్న

-ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే కక్షసాధింపులకు పాల్పడుతున్నారని మండిపాటు



హిందుస్థాన్ మీడియా

టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి తిరుపతిలో భూకబ్జా చేసినట్టు ఆరోపణలు వచ్చిన దాదాపు 16 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ స్థలంలో ఉన్న నిర్మాణాలను కూడా అధికారులు కూల్చివేశారు. ఈ నేపథ్యంలో భూమన స్పందిస్తూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాయలసీమలో ఫ్యాక్షన్ శత్రువులు ఒకరి ఆస్తులను ఒకరు ధ్వంసం చేసి రాక్షసానందం పొందినట్లే, సీఎం చంద్రబాబు కూడా తన కుటుంబ ఆస్తులపై దాడి చేయించి తృప్తి పడుతున్నారని భూమన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేసుకుని, వారి కుటుంబ ఆస్తులను ధ్వంసం చేసే దిగజారుడు రాజకీయాలకు దిగారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నాననే కక్షతో, పగ తీర్చుకోవడానికే ఈ చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించిన భూమన... ఈ విధ్వంసాలకు భయపడి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. "21 ఏళ్ల క్రితం నేను ఈ ఆస్తులు కొనుగోలు చేశాను. ఈ ఆస్తులు నాటి సీఎంలు రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి పాలనలో గానీ, గతంలో మీరు సీఎం ఉన్నప్పుడు గానీ ఆక్రమణలుగా కనిపించలేదా? నా వాణిని గట్టిగా వినిపిస్తున్నందుకే ఈ కక్షసాధింపులు చేస్తున్నారు. నేను ఏనాడూ అవినీతికి, మోసాలకు పాల్పడలేదు. తిరుపతిలో రౌడీ రాజకీయాలకు తావివ్వకుండా జీవితాంతం విలువలతో కూడిన రాజకీయమే చేశానునేను ఆశయాల కోసం బతికేవాడిని తప్ప స్వార్థంతో బతికేవాడిని కాదు. నా కుటుంబ ఆస్తులను ఎంత ధ్వంసం చేసినా మీ తప్పులను ఎత్తిచూపుతూనే ఉంటా. మీ దాడులు నాకు మరింత ఉత్సాహాన్నిస్తాయి తప్ప నన్ను వెనక్కి తగ్గించలేవు. 1991లో ప్రారంభించిన హెరిటేజ్ సంస్థ కూడా నది పోరంబోకు స్థలంలోనే ఉందనే విషయాన్ని మర్చిపోవద్దు" అని భూమన గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

## విజయవాడలో 'ఏపీ అస్త్రం' మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన సీఎం

'-ఏపీ అస్త్రం' ఆవిష్కరణ.. భవిష్యత్ పోలీసింగ్‌పై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

-ఫ్యూచర్ పోలీసింగ్ సదస్సులో పోలీసు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం

-ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో పోలీస్ వ్యవస్థను ఆధునీకరించాలని సూచన

-పోలీసులకు ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులు ప్రవేశపెట్టాలని ఆదేశం

-రతన్ టాటా హబ్, విట్ యూనివర్సిటీతో పోలీసు శాఖ ఒప్పందాలు




హిందుస్థాన్ మీడియా

ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థను ఆధునిక సాంకేతికతతో పటిష్ఠం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా విజయవాడ పోలీసులు రూపొందించిన 'ఏపీ అస్త్రం' మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో మూడు రోజుల పాటు జరిగిన 'ఏపీ పోలీస్ రిట్రీట్-2026: ఫ్యూచర్ పోలీసింగ్' కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం, నేరస్థుల పద్ధతులు పూర్తిగా మారిపోయాయని, ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసింగ్‌లో టెక్నాలజీ వినియోగం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. కేవలం టెక్నాలజీని అందిపుచ్చుకోవడమే కాకుండా, పోలీసు వ్యవస్థ నిర్మాణాన్నే పునః సమీక్షించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయ పడ్డారు భవిష్యత్ పోలీసింగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ లిటరసీ ఆధారంగా నిర్మించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని చంద్రబాబు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. 2001లోనే తాను ఫ్యూచర్ పోలీసింగ్ వర్క్‌షాప్ నిర్వహించిన విషయాన్ని గుర్తుచేస్తూ, అప్పటితో పోలిస్తే నేడు సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం, విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు పెరిగాయన్నారు. వీటిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పోలీసు వ్యవస్థ పెంపొందించుకోవాలని సూచించారు. పోలీసుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకునేందుకు వారి నైపుణ్యాలను పెంచడంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల అనుభవాన్ని గుర్తించి, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి కీలక బాధ్యతలు అప్పగించాలన్నారు. ఇందుకోసం సోషల్ మీడియా, సైబర్ నేరాలు, గంజాయి-డ్రగ్స్ నిర్మూలన, మహిళలపై నేరాల నియంత్రణ, కన్విక్షన్ రేటు పెంపు వంటి అంశాల్లో ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులను ప్రవేశపెట్టాలని ఆదేశించారు. ప్రతి పోలీసు సిబ్బందికి డిజిటల్ లిటరసీ తప్పనిసరి అని, పోలీసు ఉన్నతాధికారులు కూడా నిపుణులతో సంప్రదింపులు జరుపుతూ కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. నేరం చేసిన వారికి వేగంగా శిక్షలు పడేలా దర్యాప్తు వ్యవస్థ పనిచేస్తేనే నేరస్థుల్లో భయం పుడుతుందని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ముందస్తు ప్రణాళికలు, సమర్థవంతమైన దర్యాప్తు కీలకమన్నారు. ఈ సందర్భంగా ఏపీ పోలీస్ వెబ్‌సైట్, ధర్మ యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరిం చారు. రోడ్ సేఫ్టీ, క్రౌడ్ మేనేజ్‌మెంట్ సహా 8 అంశాలపై ఏపీ పోలీసులు.. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, విట్ యూనివర్సిటీలతో ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నారు. ఫోరెన్సిక్, డాగ్ స్క్వాడ్ విభాగాల ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, హోం సెక్రటరీ కుమార్ విశ్వజిత్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ అధికారులు, జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: పోతరాజు శంకర్




హిందుస్థాన్ మీడియా:

ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షుడు పోతరాజు శంకర్ ఖండించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా వారి పై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.

## అయాన్ పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలకు విరాళాలు

– కంప్యూటర్, విద్యా సామగ్రి అందజేసిన వెంకట్– సారిక దంపతులు




హిందుస్థాన్ మీడియా:

పోతిరెడ్డిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో మరికొండ వెంకట్, సాయి సారిక దంపతుల కుమారుడు అయాన్ పుట్టినరోజు సందర్భంగా పాఠశాలకు అవసరమైన విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు ఒక కంప్యూటర్‌తో పాటు విద్యార్థులకు ఆట వస్తువులు, స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్సిల్స్, పౌచులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకుఱ ఇలాంటి సహాయ సహకారాలు ఎంతో ఉపయోగపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ మరికొండ వెంకట్, సారిక దంపతులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. గిరి కిషన్, గ్రామ సర్పంచ్ మేడబోయిన కుమార్, ఉపాధ్యాయులు ఆయిల్ రెడ్డి, కర్రోల్ల విజయ్ కుమార్, సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి మల్లన్న రైల్వే స్టేషన్ ఆహ్వాన పత్రిక అందజేత

హిందుస్థాన్ మీడియా, చేర్యాల:



ఈ నెల 26న జరగనున్న కొమురవెల్లి మల్లన్న రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా బీజేపీ నాయకులు చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరేళ్ల వీరమల్లయ్యను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. కొమురవెల్లి మల్లన్న రైల్వే స్టేషన్ ప్రారంభంతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కాటం సురేందర్, బురుగు యాదగిరి గౌడ్, ఆరేళ్ల మహేందర్, తాటికొండ ప్రణీత్, న్యాయవాదులు పొన్నం సురేష్, దర్శణం ప్రశాంత్, కాడింగుల సౌమ్య, రిక్కల రామకృష్ణారెడ్డి, బొడ్డు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## గుంతలమయంగా అనంతగిరి-పెద్దలింగాపూర్ ప్రధాన రహదారి

– వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థుల విజ్ఞప్తి

హిందుస్థాన్ మీడియా, ఇల్లంతకుంట:



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి–పెద్దలింగాపూర్ ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. నిత్యం వేలాది మంది భక్తులు శ్రీ ముత్యాల పోచమ్మ తల్లి దర్శనానికి ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా, రహదారి గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసినప్పుడల్లా రహదారి పై నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు, రైతులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్లుగా రహదారి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం పెరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. వెంటనే ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి, అనంతగిరి–పెద్దలింగాపూర్ గ్రామాల ప్రజలకు, భక్తులకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం, సంబంధిత అధికారులను స్థానికులు కోరుతున్నారు.

# కొమురవెల్లిలో కాంగ్రెస్ ఆందోళన

– కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి: మహాదేవుని శ్రీనివాస్

హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి:



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో గురువారం జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా, విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల పార్లమెంట్ సమీపంలో విద్యార్థులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై జరిగిన లాఠీచార్జ్‌ను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహాదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశంలో విద్యా వ్యవస్థను బలహీనపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతూ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులపై లాఠీచార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి నిరసనలను అణచివేయడానికి పోలీసు బలగాలను వినియోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. దేశ భవిష్యత్తుకు పునాది అయిన విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. పార్లమెంట్ సమీపంలో జరిగిన లాఠీచార్జ్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, విద్యా వ్యతిరేక నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకుని విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ శాఖ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఐదు లక్షల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి





– ప్రభుత్వ ఆర్థిక సహాయం.. నెరవేరిన స్వప్నం
– దశాబ్దాల కల నెరవేరిన వేళ
– అద్దె భారం.. ఇబ్బందులు దూరం
– సొంత ఇంట్లో సంబురం
– ఇప్పటివరకు 3,470 ఇండ్ల నిర్మాణాలు పూర్తి
– లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో రూ.216 కోట్లు జమ

రాజన్న సిరిసిల్ల/చందుర్తి, జూలై -23 హిందుస్థాన్ మీడియా :

అర్హులైన వారు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్మించుకోవాలనే సదుద్దేశంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్ల పథకంతో సొంత ఇంటి కల నెరవేరతున్నది. రూ.ఐదు లక్షల ఆర్థిక సహాయంతోనే లబ్ధిదారుల దశాబ్దాల కల సాకారమై వారి స్వగృహం సొంతమవుతున్నది. అద్దె భారం, ఇబ్బందులు దూరమై ఆ ఇందిరమ్మ ఇండ్లు ఆనందం, ఆత్మ గౌరవ ప్రతీకకు వేదికగా నిలుస్తున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 3,470 ఇండ్లు పూర్తి కాగా, రూ. 216 కోట్లు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి. అర్హులైన వారు సొంతిల్లు కట్టుకునేలా ఆర్థిక సాయం అందించి మద్దతుగా నిలవాలని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అర్హులు తమ సొంత స్థలంలోనే నిర్మించుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానించి.. ఇండ్ల నిర్మాణానికి దశల వారీగా మొత్తం రూ. ఐదు లక్షలు అందజేస్తుంది.

వేగంగా ఇండ్ల నిర్మాణాలు..

ప్రజా ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం పక్కా ప్రణాళిక ప్రకారం పథకాన్ని లబ్ధిదారులకు అందిస్తూ.. వారి ఇబ్బందులు దూరం చేస్తుంది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ.. అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ.. పనుల్లో వేగం పెరిగేలా మార్గ నిర్దేశం చేస్తున్నారు. దీంతో ప్రజా ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటూ తమ కలను సాకారం చేసుకుంటున్నారు. రూ. 216 కోట్లు బ్యాంక్ ఖాతాల్లో జమ మొత్తం ఇండ్లు 7,367మంజూరు చేశారు. 5,932 ఇండ్లకు ముగ్గు పోశారు. బేస్ మెంట్ స్థాయిలో 5,138 ఉన్నాయి. గోడల స్థాయిలో 4,534 ఉండగా, 4,229 ఇండ్లు స్లాబ్ స్థాయిలో ఉన్నాయి. 3,470 ఇండ్లు పూర్తి అయ్యాయి. లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో మొత్తం 216 కోట్ల రూపాయలు నేరుగా జమ అయ్యాయి. ఇండ్లు పూర్తి అయి.. పండుగ వాతావరణంలో గృహ ప్రవేశాలు పూర్తి అయ్యాయి.

ప్రభుత్వ సహాయం.. సద్వినియోగం..

జిల్లాలోని చందుర్తి మండలం కట్టలింగంపేట గ్రామానికి చెందిన పలువురు



లబ్ధిదారులు తమ సొంత స్థలంలో ప్రజా ప్రభుత్వం విడతల వారీగా అందజేసిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని రూ. 5 లక్షలలోపే తమ సొంత ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకొని తమ దశాబ్దాల కలను నెరవేర్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంతో పడుతున్న ఇబ్బందులు, అద్దె భారాలు దూరమై స్వగృహకల నెరవేరిందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందించిన సహాయం లోనే అధికారుల సూచనల మేరకు లబ్ధిదారులు ప్రతి పనికి ప్రణాళిక ప్రకారం డబ్బులు ఖర్చు చేసి ప్రభుత్వ ఆర్థిక సహాయంతోనే ఇండ్లను పూర్తి చేసుకోవడం మంచి పరిణామం.

ఐదు లచ్చల ఇల్లు అయింది.. మారుపాక నర్సవ్వ, కట్టలింగంపేట, చందుర్తి మండలం

సొంత ఇల్లు లేక మస్తు కిరాయి ఇండ్లల్ల తిరిగినం. మాకు దేవునోలే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిరు. ఆల్లు ఇచ్చిన రూ. ఐదు లచ్చలోనే ఇల్లు అయింది. కిరాయి బాధలు తప్పినయి. మాకు ఇల్లు ఇచ్చిన ఎమ్మెల్యే ఆది శ్రీన్ననకు, కలెక్టర్ మేడమ్ అగ్రవాల్ కు పది వేల దండాలు.

ఇల్లు లేక చాలా ఇబ్బంది పడ్డం పల్లికొండ మౌనిక, కట్టలింగంపేట, చందుర్తి మండలం

నా పేరు పల్లికొండ మౌనిక. మేము సొంత ఇల్లు లేక చాలా ఇబ్బంది పడ్డం. అద్దె ఇంట్లో ఉండి కిరాయి చెల్లిస్తూ ఆర్థికంగా సమస్యలు ఎదురుకున్నాము. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి దరఖాస్తు చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం అందించిన 5 లక్షల్లోనే ఇల్లు కట్టుకున్నాం. ఇల్లు ఇప్పించి ఆర్థిక సహాయం మంజూరు చేయించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకుందాం: మంత్రి కొండా సురేఖ

– టీఎస్‌జేయూ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక 2కే రన్

హిందుస్థాన్ మీడియా, హనుమకొండ:



తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ హనుమకొండ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం "Break Free from Drugs - Build a Bright Future", "Say No to Drugs" నినాదాలతో హనుమకొండ కలెక్టరేట్ నుంచి కాళోజీ జంక్షన్ వరకు డ్రగ్స్ వ్యతిరేక 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఉజ్వల భవిష్యత్తు కోసం డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, అదనపు కలెక్టర్ రవి, వరంగల్ డీసీపీ ధారా కవిత తదితరులు పాల్గొని జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి "సే నో టు డ్రగ్స్" ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో నార్కోటిక్స్ డీఎస్పీ రమేష్, డీటీఓ జనార్ధన్ రెడ్డి, ఎంవీఐ కిరణ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య, డీపీఆర్‌వో అయూబ్ అలీ, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, టీఎస్‌జేయూ నాయకులు, జర్నలిస్టులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్లు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు.

## బిజినెస్

# భారత్‌లోకి మెర్సిడెస్ కొత్త హైబ్రిడ్ సెడాన్ లాంచ్.. ధర, ఫీచర్లు ఇవే!

**భారత్‌లో 'మెర్సిడెస్-ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్‌ద 4మేటిక్‌ం' సెడాన్ విడుదల**

**దేశంలోనే ఇది తొలి ఎలక్ట్రిఫైడ్ ఏఎమ్‌జీ ఈ-క్లాస్ ప్లగ్-ఇన్ హైబ్రిడ్ మోడల్**

**పెర్ఫార్మెన్స్, రేసింగ్ ఎడిషన్లలో లభ్యం.. ప్రారంభ ధర రూ. 1.45 కోట్లు**

**పెట్రోల్ ఇంజిన్, ఎలక్ట్రిక్ మోటార్‌తో 612 హెచ్‌పీ పవర్.. 3.8 సెకన్లలో 100 కి.మీ వేగం**

**రేస్ ట్రాక్ పనితీరుతో పాటు రోజువారీ వినియోగానికి అనువుగా రూపకల్పన**




ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్-బెంజ్ ఇండియా, భారత మార్కెట్లో తన ప్లగ్-ఇన్ హైబ్రిడ్ పోర్ట్‌ఫోలియోను మరింత బలోపేతం చేసింది. దేశంలోనే తొలి ఎలక్ట్రిఫైడ్ ఏఎమ్‌జీ ఈ-క్లాస్ సెడాన్ అయిన 'మెర్సిడెస్-ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్ 4మేటిక్‌ం'ను గురువారం లాంచ్ చేసింది. ఏఎమ్‌జీ బ్రాండ్ అందించే అద్భుతమైన పనితీరుతో పాటు ప్లగ్-ఇన్ హైబ్రిడ్ టెక్నాలజీ అందించే ఇంధన సామర్థ్యం ఈ కారు సొంతం. ఈ కొత్త సెడాన్ రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. పెర్ఫార్మెన్స్ ఎడిషన్ ధర రూ. 1.45 కోట్లు కాగా, రేసింగ్ ఎడిషన్ ధర రూ. 1.48 కోట్లుగా (రెండు ధరలూ ఎక్స్-షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. పెట్రోల్ ఇంజిన్, ఎలక్ట్రిక్, ప్లగ్-ఇన్ హైబ్రిడ్ వంటి విభిన్న పవర్‌ట్రెయిన్ ఆప్షన్లను వినియోగదారులకు అందించాలనే తమ వ్యూహంలో భాగంగా ఈ కారును విడుదల చేసినట్లు మెర్సిడెస్-బెంజ్ పేర్కొంది. ఈ సందర్భంగా మెర్సిడెస్-బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోశ్ అయ్యర్ మాట్లాడుతూ.. "భారత ఆటోమోటివ్ పరిశ్రమలో ఈ-క్లాస్ సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న మోడల్. కొత్త ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్, అద్భుతమైన పనితీరు, రోజువారీ వినియోగానికి అవసరమైన సౌలభ్యం, ఎలక్ట్రిక్ సామర్థ్యం వంటి అంశాలను ఒకేచోట అందిస్తోంది. రేస్ ట్రాక్ మీద అవసరమైన పెర్ఫార్మెన్స్‌ను, రోజువారీ ప్రయాణాలకు కావాల్సిన ప్రాక్టికాలిటీని ఈ సెడాన్ సమన్వయం చేస్తుంది" అని వివరించారు. ఇంజిన్, పనితీరు వివరాలు మెర్సిడెస్-ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్‌లో 3.0-లీటర్ ఇన్‌లైన్ సిక్స్-సిలిండర్ టర్బోచార్జ్డ్ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 449 హార్స్‌పవర్ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. దీనికి ఏఎమ్‌జీ స్పీడ్‌షిఫ్ట్ టీసీటీ 9జీ ట్రాన్స్‌మిషన్‌లో అనుసంధానించిన 120 కిలోవాట్ల ఎలక్ట్రిక్ మోటార్‌ను జతచేశారు. ఈ రెండూ కలిసి ఏకంగా 585 హెచ్‌పీ (రేస్ స్టార్ట్ ఫంక్షన్‌తో 612 హెచ్‌పీ) శక్తిని, 750 చీఎ టార్క్‌ను విడుదల చేస్తాయి. ఈ కారు కేవలం 3.8 సెకన్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని గరిష్ఠ వేగాన్ని ఎలక్ట్రానిక్‌గా గంటకు 250 కిలోమీటర్లకు పరిమితం చేశారు. అయితే, అదనపు ఏఎమ్‌జీ డ్రైవర్స్ ప్యాకేజీతో ఈ వేగాన్ని 280 కిలోమీటర్ల వరకు పెంచుకోవచ్చు.

# తొలి టీ20: జింబాబ్వేను కట్టడి చేసిన టీమిండియా బౌలర్లు



**-భారత్‌తో తొలి టీ20లో తడబడిన జింబాబ్వే**

**-టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న టీమిండియా**

**-20 ఓవర్లలో 7 వికెట్లకు 125 పరుగులు చేసిన జింబాబ్వే**

**-చెరో రెండు వికెట్లతో చెలరేగిన మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్**

**-భారత్ విజయలక్ష్యం 126 పరుగులు**

జింబాబ్వే పర్యటనలో హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరుగుతున్న తొలి టీ20 మ్యాచ్‌లో భారత బౌలర్లు సమష్టిగా రాణించి ఆతిథ్య జట్టును కట్టడి చేశారు. టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న టీమిండియా, జింబాబ్వేను నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులకే పరిమితం చేసింది. యువ పేసర్లు మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్ తమ పదునైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వేకు ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. ఇన్నింగ్స్ మొదటి బంతికే మయాంక్ యాదవ్ తన పేస్‌తో ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్‌ను (0) ఇషాన్ కిషన్ క్యాచ్‌గా పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత మరో ఓపెనర్ బెన్ కరన్ (10) రెండు ఫోర్లతో దూకుడుగా కనిపించినా, ప్రిన్స్ యాదవ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. పవర్‌ప్లే ముగిసేసరికి జింబాబ్వే 3 వికెట్లు కోల్పోయి 26 పరుగులు మాత్రమే చేసి కష్టాల్లో పడింది. కీలక ఆటగాడు, కెప్టెన్ సికిందర్ రజా (4) కూడా శివమ్ దూబే బౌలింగ్‌లో ఔట్ అవ్వడంతో జింబాబ్వే 32 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో వెస్లీ మధెవెరె (39), ర్యాన్ బర్ల్ (26)తో కలిసి ఐదో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే వీరిద్దరూ నెమ్మదిగా ఆడటంతో రన్‌రేట్ పెరగలేదు. నిలకడగా ఆడిన మధెవెరె 34 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 39 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. చివరి ఓవర్లలో తాడివనాశే మరుమాని 20 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా 27 పరుగులు చేయడంతో జింబాబ్వే స్కోరు 125 పరుగులకు చేరింది. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ 4 ఓవర్లలో కేవలం 18 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టగా, ప్రిన్స్ యాదవ్ కూడా 4 ఓవర్లలో 19 పరుగులిచ్చి 2 వికెట్లతో రాణించాడు. శివమ్ దూబే, రవి బిష్ణోయ్ చెరో వికెట్ తీసుకున్నారు.

## క్రీడలు

### వైభవ్ సూర్యవంశీ దంచుడు... జింబాబ్వేపై టీమిండియా ఈజీ విక్టరీ



తొలి టీ20లో జింబాబ్వేపై భారత్ 7 వికెట్ల తేడాతో విజయందఅరంగేట్ర మ్యాచ్‌లోనే 19 బంతుల్లో 50 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్ ధాటికి 125 పరుగులకే పరిమితమైన జింబాబ్వే 13.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించిన భారత్ జింబాబ్వే పర్యటనను భారత జట్టు ఘన విజయంతో ప్రారంభించింది. హరారే వేదికగా జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ (50; 19 బంతుల్లో 4ఇ4, 4ఇ6) విధ్వంసకర అర్ధశతకంతో చెలరేగడంతో టీమిండియా సునాయాసంగా నెగ్గింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 126 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. అభిషేక్ శర్మ (1) త్వరగా ఔటయ్యాడు. అయితే, మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 19 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం పూర్తి చేసి జింబాబ్వే బౌలర్లను ఉతికారేశాడు. అతనికి ఇషాన్ కిషన్ (35) చక్కటి సహకారం అందించడంతో భారత్ విజయం సులువైంది. వీరిద్దరూ ఔటయ్యాక, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28 నాటౌట్), తిలక్ వర్మ (6 నాటౌట్) మిగిలిన లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో భారత్ 13.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబానీ రెండు వికెట్లు తీశాడు. అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నిర్ణయం సరైనదని బౌలర్లు నిరూపించారు. యువ పేసర్ మయాంక్ యాదవ్ (2/18) తన వేగంతో జింబాబ్వే బ్యాటర్లను వణికించాడు. మరో పేసర్ ప్రిన్స్ యాదవ్ (2/19) కూడా రాణించడంతో ఆతిథ్య జట్టు 32 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వెస్లీ మధెవెరె (39), తడివానశే మరుమాని (27 నాటౌట్) కాసేపు పోరాడినా స్కోరు బోర్డును వేగంగా ముందుకు నడిపించలేకపోయారు. దీంతో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులు మాత్రమే చేయగలిగింది.

# 'చెన్నై లవ్ స్టోరీ' గ్రాండ్ రిలీజ్

**-'బేబీ' మేకర్స్ నుంచి వస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ'**
**-కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన చిత్రం**
**-జులై 24న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల**
**-రెండేళ్ల మా కష్టం ఈ సినిమా అన్న నిర్మాత ఎస్కేఎన్**
**మణిశర్మ సంగీతం అందిస్తున్న ఫీల్ గుడ్ లవ్ స్టోరీ**

టాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన 'బేబీ' చిత్రం తర్వాత, ఆ చిత్ర నిర్మాతల నుంచి మరో ఆసక్తికరమైన ప్రేమకథ రేపు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' అనే సినిమా శుక్రవారం (జులై 24న) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. 'కలర్ ఫోటో', 'బేబీ' వంటి విజయవంతమైన చిత్రాల నిర్మాతలు ఎస్కేఎన్, సాయి రాజేష్ ఈ సినిమాను నిర్మించడంతో దీనిపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా నిర్మాత ఎస్కేఎన్ సోషల్ మీడియా వేదికగా ఓ భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు. "'బేబీ' విడుదలై మూడేళ్లు గడిచింది. 'చెన్నై లవ్ స్టోరీ' కోసం రెండేళ్లుగా మా హృదయం, ఆత్మ, సమయం, కష్టమంతా ధారపోశాం. ఒక జర్నలిస్టుగా మొదలై నిర్మాతగా మారిన నా ప్రయాణంలో ప్రతి అడుగు మీ ప్రేమ, ప్రోత్సాహం వల్లే సాధ్యమైంది. అందమైన, ఫీల్ గుడ్, ఎమోషనల్, ఇంటెన్స్ లవ్ స్టోరీని మీ ముందుకు తీసుకొస్తున్నాం. ఇది మాకు కుటుంబం లాంటి సినిమా. దయచేసి థియేటర్లలో సినిమా చూసి మీ టికెట్‌తో మమ్మల్ని ఆశీర్వదించండి. మీ ప్రేమనే మాకు మరిన్ని మంచి కథలు చెప్పే స్ఫూర్తినిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. స్టీవెన్, నివి అనే ఇద్దరు యువతీ యువకుల ప్రేమ, కలలు, వారి జీవితాలను మార్చేసిన క్షణాల చుట్టూ ఈ కథ నడుస్తుందని చిత్ర యూనిట్ తెలిపింది. ఇది నిజాయతీతో కూడిన, తీవ్రమైన యూత్‌ఫుల్ లవ్ స్టోరీ అని వారు అభివర్ణించారు. మాస్ మూవీ మేకర్స్, అమృత ప్రొడక్షన్స్ బ్యానర్లపై రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహించగా... ధీరజ్ మొగిలినేని సహ నిర్మాతగా వ్యవహరించారు. మణిశర్మ సంగీతం, అనంత శ్రీరామ్ సాహిత్యం, విశ్వాస్ డేనియల్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. 'బేబీ' లాంటి బ్లాక్‌బస్టర్ అందించిన టీమ్ నుంచి వస్తుండటంతో 'చెన్నై లవ్ స్టోరీ'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.



# ఓవర్సీస్‌లో 'చెన్నై లవ్ స్టోరీ' హంగామా.. కిరణ్ అబ్బవరం చిత్రానికి బ్లాక్‌బస్టర్ స్టార్ట్!



**కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్ స్టోరీ'కి ఓవర్సీస్‌లో బ్లాక్‌బస్టర్ ఆరంభం**
**అమెరికా, యూకేలోని ప్రధాన నగరాల్లో ప్రీమియర్ షోలకు అద్భుత స్పందన**
**'బేబీ' ఫేమ్ సాయి రాజేష్ కథ అందించడంతో సినిమాపై భారీ అంచనాలు**
**ప్రత్యాంగిర సినిమాస్ ద్వారా విదేశాల్లో ఘనంగా విడుదల**
**మణిశర్మ సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని టాక్**

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటించిన తాజా చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ సినిమా గురువారం ఓవర్సీస్‌లో గ్రాండ్ ప్రీమియర్ షోలతో హంగామా సృష్టించింది. తొలి ప్రదర్శనల నుంచే ఈ చిత్రానికి విదేశాల్లోని తెలుగు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తున్నట్టు తెలుస్తోంది. అమెరికా, యూకే వంటి దేశాల్లోని పలు ప్రధాన నగరాల్లో ప్రదర్శిస్తున్న ప్రీమియర్ షోలకు 'బ్లాక్‌బస్టర్ స్టార్ట్' లభించిందని చిత్ర యూనిట్ ప్రకటించింది.'బేబీ' వంటి కల్ట్ క్లాసిక్ బ్లాక్‌బస్టర్ తర్వాత రచయిత, దర్శకుడు సాయి రాజేష్ ఈ సినిమాకు కథ అందించడంతో దీనిపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. రవి నంబూరి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కింది. ప్రత్యాంగిర సినిమాస్ సంస్థ ఈ చిత్రాన్ని ఓవర్సీస్‌లో భారీ ఎత్తున విడుదల చేసింది. అమెరికాలోని పలు ఏఎంసీ, సినిమార్క్ థియేటర్లతో పాటు యూకేలోనూ షోలు హౌస్‌ఫుల్ అవుతున్నట్టు సమాచారం. ఈ సినిమాకు 'స్వరబ్రహ్మ' మణిశర్మ అందించిన సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోందని ప్రీమియర్ షోలు చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. కిరణ్ అబ్బవరం నటన, సాయి రాజేష్ మార్క్ కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని చెబుతున్నారు. కొంతకాలంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న కిరణ్ అబ్బవరానికి, ఓవర్సీస్ నుంచి వస్తున్న ఈ పాజిటివ్ టాక్ పెద్ద ఊరటనిస్తోంది. ఈ చిత్రం రేపు (జులై 24) విడుదల కానున్న నేపథ్యంలో, తెలుగు బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఎలాంటి ప్రభావం చూపుతుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# 'కేస్ ఆఫ్ కొండాన' మూవీ రివ్యూ!

కన్నడలో విజయ్ రాఘవేంద్రకి మంచి క్రేజ్ ఉంది. తన బాడీ లాంగ్వేజ్ కి తగిన పాత్రలను ఎంచుకుంటూ ఆయన ముందుకు వెళుతున్నాడు. ఆయన హీరోగా రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ సినిమాలలో 'కేస్ ఆఫ్ కొండాన' ఒకటిగా చెప్పుకోవచ్చు. దేవీప్రసాద్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ సినిమా, 2024లో జనవరి 26వ తేదీన థియేటర్లకు వచ్చింది. అనూహ్యమైన రెస్పాన్స్ ను తెచ్చుకుంది. భావన కీలకమైన పాత్రను పోషించిన ఈ సినిమా, ఈ రోజు (జులై 23) నుంచి 'ఈటీవీ విన్' లో స్ట్రీమింగ్ అవుతోంది. 'చామరాజ్ పేట్' పోలీస్ స్టేషన్ విల్సన్ ( విజయ్ రాఘవేంద్ర) కొత్తగా డ్యూటీలో చేరతాడు. అక్కడ ఏఎస్ ఐగా లక్ష్మీ (భావన) ఉంటుంది. ఆమె తండ్రి త్యాగరాజ్ (రంగాయన రఘు) కూడా మరో పోలీస్ స్టేషన్ లో ఏఎస్ ఐగా పని చేస్తుంటాడు. లక్ష్మీ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా హత్యలు జరుగుతుంటాయి. హంతకుడిని వెతికి పట్టుకునే పనిలో లక్ష్మీ బిజీగా ఉంటుంది. ఆ పోలీస్ స్టేషన్ లో ఇన్ స్పెక్టర్ మహేంద్ర (బలరాజ్ వాడి) ఆమెకి కుడిభుజంగా ఉంటాడు. మహేంద్రకి విల్సన్ కొంత డబ్బు ఇవ్వవలసి ఉంటుంది. తన కారు అమ్మేసి ఇవ్వాలని విల్సన్ నిర్ణయించుకుంటాడు. అదే సిటీలోని ఒక హాస్పిటల్లో డాక్టర్ గా పనిచేస్తున్న 'సహన' (ఖుషీ రవి)ని అతను ప్రేమిస్తుంటాడు. కొన్ని రోజుల క్రితం డాక్టర్ 'సహన' ఒక కేసును చూస్తుంది. రాజు అనే అతని కొడుకు బసంత్ కి పరీక్షలు చేయించి, ట్రీట్మెంట్ కి 5 లక్షలు సిద్ధం చేసుకోమని చెబుతుంది. రాజు అదే ఏరియాలో రోడ్డు పక్కన 'పానీ పూరి' బండి పెట్టుకుని తన జీవనాన్ని కొనసాగిస్తూ ఉంటాడు. మహేంద్రకి డబ్బు ఇవ్వడం కోసం 'కారు'లో వెళుతున్న విల్సన్ కి, ఆ పానీ పూరి బండి దగ్గరే ప్రమాదం జరుగుతుంది. ఆ సమయంలోనే కారులోని డబ్బును 'రాజు' కాజేస్తాడు. ఆ డబ్బు కోసం రాజు – విల్సన్ మధ్య జరిగిన పెనుగులాటలో రాజు చనిపోతాడు. అప్పుడు విల్సన్ ఏం చేస్తాడు? ఎలాంటి పరిణామాలను ఎదుర్కొంటాడు? అనారోగ్యంతో బాధపడుతున్న రాజు కొడుకు పరిస్థితి ఏమిటి? వరుసగా జరుగుతున్న హత్యలకు కారకులు ఎవరు? అనే ఆసక్తికరమైన మలుపులతో ఈ కథ ముందుకు వెళుతుంది.ఇది ఒక పోలీస్ ఆఫీసర్ కథ. సిన్సియర్ ఆఫీసర్ గా పేరు తెచ్చుకోవాలనే పట్టుదలతో డ్యూటీలో దిగిన విల్సన్, అనుకోని సంఘటనతో హంతకుడిగా నిలబడి పోతాడు. ఆ నేరం నుంచి బయటపడటం కోసం అతను చేసే ప్రయత్నాలు, మరిన్ని దారుణాలకు కారణమవుతాయి. అలాంటి పరిస్థితులలో అతను ఏం చేస్తాడు? అనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు. నగరంలో ఒక వైపున ఒక హంతకుడు పథకం ప్రకారం హత్యలు చేస్తూ వెళుతుంటాడు. మరో వైపున ఎలాంటి ఉద్దేశం లేకుండానే విల్సన్ అనే పోలీస్ అధికారి వరుస మరణాలకు కారకుడవుతూ వెళుతుంటాడు. ఈ రెండు వైపులా ఇన్వెస్టిగేషన్ చేపట్టిన లక్ష్మీకి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అనే కుతూహలం ఆడియన్స్ ను అలా కూర్చోబెట్టేస్తుంది. అడుగడుగునా ఉత్కంఠను పెంచుతూ వెళుతుంది. ఒక వైపున ఒక పాత్రకు.. మరో పాత్రకి గల సంబంధాలు .. అనుబంధాలు, మరో వైపున ఆ పాత్రల చుట్టూనే తిరిగే కథ ఉత్కంఠభరితంగా అనిపిస్తుంది. విశ్రాంతి సమయానికి దర్శకుడు ఒక రేంజ్‌కి కథను తీసుకొచ్చి వదులుతాడు. సెకండాఫ్ ఫస్టు సీన్ నుంచే ఊపిరి బిగబట్టి చూసేలా ఉంటుంది. ఆ టెంపో క్లైమాక్స్ వరకూ అలా కంటిన్యూ చేయడమే దర్శకుడి గొప్పతనంగా చెప్పుకోవాలి. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ రెండూ కూడా మరింత బలంగా కనెక్ట్ అవుతాయి. కొంతమంది పోలీసులు తొందరపాటు కారణంగా నేరస్థులుగా మారుతుంటారు. అలాంటివాళ్లను కాపాడటానికి కొంతమంది పోలీసులు ప్రయత్నిస్తే, తమ్ముడు మనవాడైనా ధర్మం తప్పకూడదు అన్నట్టుగా మరికొందరు పోలీసులు వ్యవహరిస్తూ ఉంటారు. అలా పోలీసులలోని మూడు కోణాలను దర్శకుడు చూపించిన తీరు మెప్పిస్తుంది.ఈ కథలో ప్రధానమైన పాత్రలలో కనిపించేది పోలీసులే. విజయ్ రాఘవేంద్రతో పాటు ప్రతి ఒక్కరూ చాలా బాగా చేశారు. నిజమైన పోలీసుల మాదిరిగానే అనిపిస్తారు. విశ్వజిత్ రావు కెమెరా పనితనం .. గగన్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంటాయి. ఎడిటింగ్ కూడా చాలా పెర్ఫెక్ట్ గా అనిపిస్తుంది. ఎవరూ లేని ప్రదేశంలో .. ఎవరూ చూడని సమయంలో నేరం చేసినా, ప్రకృతి అక్కడ ఒక సాక్షిని సృష్టిస్తూనే ఉంటుంది అనే దిశగా ఈ కథ నడుస్తుంది. మొదటి నుంచి చివరి వరకూ ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. బలమైన కథాకథనాలతో సాగిపోయే ఈ సినిమా, థ్రిల్లర్ చిత్రాలను ఇష్టపడేవారికి మరింతగా నచ్చేస్తుందని చెప్పచ్చు.






Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455